క్లుప్తంగా

నేడు కంకిపాడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయభాస్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమానికి సామగ్రి అందజేత



కంకిపాడు: పెద్దల పట్ల గౌరవభావంతో మెలగాలని ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి సూచించారు. వణుకూరులోని వృద్ధుల ఆశ్రమంలో పాఠశాల విద్యార్థులు గురువారం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు పండ్లు, దుప్పట్లు, వస్తు సామగ్రి అందజేశారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఆపన్నులకు చేయూత అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి ఎలా జీవితం సాగించాలో వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్లపాలెం - తెంపల్లి రహదారికి మరమ్మతులు



గన్నవరం రూరల్: మండలంలోని మర్లపాలెం – తెంపల్లి ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతు పనులు చేస్తున్నట్లు డీఈఈ బలరాం గురువారం తెలిపారు. ఈ రోడ్డు మార్గంలో గుంతలు ఏర్పడటంతో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వందలాది ఎకరాల పంట భూములు ఈ రోడ్డు వెంట ఉన్నాయి. తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, శివారు గ్రామాలు బల్లిపర్రు, మెట్లపల్లి గ్రామాల ప్రజలు నిత్యం గన్నవరానికి ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. జాతీయ రహదారిని ప్రత్యామ్నాయంగా ఈ రోడ్డును వినియోగిస్తారు. ఈ రోడ్డు మార్గం దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రూ.15 లక్షల అంచనాతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.

వరద బాధితులకు ఎమ్మెల్సీ కుంభా సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ఒకటైన అజిత్‌సింగ్‌నగర్‌లో ఆయన గురువారం పర్యటించి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అందరికీ సాయం అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇళ్లు మునిగిపోయి కట్టుబట్టలతో బయటకు వచ్చేసిన తమలాంటి అసలైన బాధితుల వరకు రావడం లేదని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నేవీస్, ఏపీ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుమల రామచంద్రయ్య, ఎన్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి కుంభా ఉదయ్ కుమార్, ఎన్‌టీఎఫ్ నంద్యాల, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు నాగసారి సుంకన్న, పులి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపుతో
రైతులకు అపార నష్టం



చోడవరం వద్ద కృష్ణానది వరదలకు ముంపునకు గురై దెబ్బతిన్న వరి పంట

- ఎన్యూమరేషన్ పూర్తి
- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపు

పెనమలూరు: కృష్ణానది వరద ముంపుతో పాటు భారీ వర్షాల కారణంగా వివిధ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీనిపై ఎన్యూమరేషన్ చేసిన అధికారులు మండల పరిధిలో పంటల నష్టం వివరాలు గురువారం ప్రకటించారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్న యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలో వరద ముంపునకు పంటలు దెబ్బతిన్నాయి. పోరంకి, కానూరు, వణుకూరు, గోసాల, తాడిగడప గ్రామాల్లో డ్రెయినేజీలు పూడిక తీత చేపట్టకపోవటంతో పంట పొలాలు నీట మునిగాయి. పంటల సాగు చేపట్టి 40–60 రోజుల మధ్యలో భారీ వర్షాలు, కృష్ణానది వరద కారణంగా రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. వరి సాగు చేసే రైతులతో పాటు ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. ప్రధానంగా పసుపు, కంద, అరటి సాగు చేసే రైతులకు అపారనష్టం కలిగింది.

ఎన్యూమరేషన్ పూర్తి

పంటల నష్టంపై ప్రభుత్వం ఎన్యూమరేషన్ చేయాలని ఆదేశించటంతో గత నాలుగు రోజులుగా దెబ్బతిన్న వివిధ రకాల పంటలపై వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు ఎన్యూమరేషన్ చేశారు. వివిధ రకాల పంటల్లో అత్యధికంగా వరి 748 ఎకరాల్లో పంట దెబ్బతింది. కృష్ణానది వరదతో పాటు గ్రామాల్లో డ్రెయినేజీ వసతి సక్రమంగా లేక పోవటంతో వరి పంట ఎక్కువగా ముంపునకు గురైంది. ఇక కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని భూముల్లో ఉద్యానవన పంటలు బాగా సాగు జరుగుతున్నాయి. కృష్ణానదికి భారీ వరద రావటంతో పసుపు, కంద, అరటి, బొప్పాయి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అరటి, పసుపు, బొప్పాయి, కందకు ఎకరానికి ఇప్పటికే రైతులు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. వరి, చెరకు పంటలకు ఎకరాకు రూ.25 వేలకు పైగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు పంటలు పూర్తిగా పోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాగా ప్రభుత్వ లెక్కల ప్రకారం అరటి హెక్టారుకు రూ.25 వేలు, బొప్పాయి, కూరగాయలు, కంద పంటలకు హెక్టారుకు రూ.17 వేలు, తమలపాకులకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున సాయం అందే అవకాశం ఉంది. సీఎం ప్రకటించిన విధంగా వరికి ఎకరాకు రూ.10 వేలు ఇస్తారు. పంట నష్టం రూ.10 కోట్లకు పైగానే ఉండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. అయితే ప్రభుత్వ సాయంతో రైతులకు ఏమాత్రం న్యాయం జరగేలా లేదు. కేంద్ర బృందం వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలించటంతో పంట నష్టం సాయం పెరుగుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కంకిపాడులో 6,428 ఎకరాల్లో పంట నష్టం

కంకిపాడు: వరద, భారీ వర్షాలు అన్నదాతను పూర్తిగా నీటముంచాయి. కోటి ఆశలతో సాగు చేపట్టిన రైతులకు కష్టమే మిగిలింది. వరద, భారీ వర్షాలతో పంట పొలాలు నీట మునగటంతో పెట్టుబడులు మొత్తం కోల్పోయారు. నీటి ముంపుతో పంట చేలు కుళ్లిపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నష్టం నమోదులో అధికారులు

పంట నష్టం అంచనాలను నమోదు చేసేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన సమాచారం ఆధారంగా రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నంబరు, సాగుదారుల వివరాలను, పంట నష్టం వివరాలను నమోదు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రం, స్థానిక కార్యాలయాల్లో వివరాలు అందించాలని సూచిస్తున్నారు.

పెనమలూరు మండలంలో దెబ్బతిన్న పంటల వివరాలు

పంట పేరు	విస్తీర్ణం ఎకరాల్లో	రైతుల సంఖ్య
వరి	748.5	338
మొక్కజొన్న	5.55	4
చెరకు	38.75	27
మినుము	10	5
పసుపు	107	62
కూరగాయలు	105	46
కంద	42	27
బొప్పాయి	3.9	4
అరటి	67	39
మొత్తం	1,127.7	552

7 వేల ఎకరాలకు పైగా పంట నష్టం

గన్నవరం రూరల్: ఇటీవల వర్షాలకు మండలంలోని గ్రామాల్లో 7 వేల ఎకరాలకు పైగా వరి, పత్తి పంటలు దెబ్బతిన్నట్లు ఎంఏవో ఎస్ఎల్ తేజస్వి చెప్పారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. 21 గ్రామాల్లో ఎన్యూమరేషన్ ముగిసిన అనంతరం 7 వేల ఎకరాలకు పైగా పంట నష్టపడిన రైతుల వివరాలను నమోదు చేశామన్నారు. 40 ఎకరాల్లో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని ఇన్‌చార్జి హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ చెప్పారు.

ప్రత్యామ్నాయ పంటలపై ఆలోచన..

బుడమేరు ఉగ్రరూపం, భారీ వర్షాలతో కృష్ణానదికి పెరిగిన వరదతో ఏటిపాయ వెంబడి, ఇటు బుడమేరు, ఏనుగుల కోడు, వన్నేరు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించాయి. ఊళ్లను, పంట పొలాలను ముంచుతూ వరద నీరు పోటెత్తింది. ప్రస్తుతం వరద ఉధృతి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. పంట పొలాలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. అయితే వారం రోజులకు పైగా వరద నీటిలో వరి చేలు ఉండటంతో వరి దుబ్బులు కుళ్లిపోయి పనికిరాకుండా పోయాయి. వరి దుబ్బులు తిరిగి జీవం పోసుకునే స్థితిలో కూడా లేదు. ఎకరాకు ఇప్పటికే రైతులు సుమారు రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. కౌలు ఒప్పందాలు ఎకరాకు 18 బస్తాల నుంచి 25 బస్తాల వరకూ ఒప్పుకుని సాగు చేపట్టారు. ప్రకృతి విపత్తుతో పెట్టుబడులు మొత్తం వరద నీటిలో కోల్పోవాల్సి వచ్చింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వరదలు, వర్షాలు కారణంగా 6,428 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా గొడవర్రులో 1,100 ఎకరాలు దెబ్బతింది. పొలాల్లో నిలిచిన మురుగునీటిని పంట కాలువలు, బోదెల్లోకి తరలించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. తిరిగి ప్రత్యామ్నాయ పంట ఏది వేయాలా? అన్న ఆలోచనలో ఉన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



కంకిపాడులో మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సిబ్బంది, సామాజిక కార్యకర్త కిషోర్‌బాబు

కంకిపాడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడు పట్టణంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మా కార్యక్రమం గురువారం నిర్వహించారు. సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్‌బాబు చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కిషోర్‌బాబు కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..

కంకిపాడు జెడ్పీ పాఠశాలలో పోషణ్ మా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నీరు, పారిశుద్ధ్యం, రక్తహీనతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కంకిపాడు పట్టణంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంకిపాడు జెడ్పీ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

14న కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న శాలివాహనులు

విజయవాడరూరల్: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం రామాయణ కావ్య జనయిత్రి, తొలి తెలుగు కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైసూర్ మహారాజా, మైసూర్ ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ చేతుల మీదుగా శాలివాహనుల ఆడపడుచు మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, దక్షిణ భారత కుమ్మరి సంఘం అధ్యక్షుడు శివ కుమార చాడిశెట్టి, ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో శాలివాహనులు హాజరవుతున్నారని తెలియజేశారు. మొల్ల జయంతి వేడుకలను పురస్కరించుకుని కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో విజయవాడ నగర శాలివాహన సంఘం అధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్, ప్రధానకార్యదర్శి డి.సత్యనారాయణమూర్తి, సంఘ నాయకులు సి.శ్రీనివాసరావు, ఎస్.శివ, ఆర్.కోటేశ్వరరావు, ఎస్.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలిచిన దాతలు



దావాజిగూడెంలో కిట్ అందజేస్తున్న హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు



రామవరప్పాడులో దుస్తులు అందజేస్తున్న జూలూరు నాగేశ్వరరావు తదితరులు

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వరద బాధితులకు వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, పరిశుభ్రత కిట్లను గురువారం అందజేశారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సభ్యులు పి.శ్రీనివాసులు చేతుల మీదుగా 300 మందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల వల్ల కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. వరద బాధితులను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించి ఐదు వేల మందికి నిత్యావసరాలు, పరిశుభ్రత కిట్లను అందజేశామని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు మహేంద్ర కాసుల, వై.కిషోర్, చంద్రశేఖర్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

దుస్తుల అందజేత..

రామవరప్పాడు: వరద ప్రభావంతో సర్వం కోల్పోయిన బాధితులకు రామవరప్పాడులోని శ్రీ వాసవీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు బాసటగా నిలిచారు. మండలంలోని పలు గ్రామాల్లో దాతల ద్వారా సేకరించిన పాత దుస్తులను సేకరించి బాధితులకు అందజేశారు. మహిళలు, చిన్నారులు, పురుషులకు అవసరమైన దుస్తులను జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో గురువారం మినీ వ్యాన్‌లో తీసుకెళ్లి అందించారు. బాధితులకు సహాయం అందించేందుకు చాలా మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జూలూరు కృష్ణారావు, అనగొంది ప్రసాద్, పేర్ల వాసు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మల్లవల్లి సాగుదారులకు పరిహారం మంజూరు చేయాలి



ఎంపీ బాలశౌరికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు, సాగుదారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ భూ నిర్వాసితులకు తక్షణమే నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరుతూ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి వినతిపత్రం అందజేశారు. మంగళగిరిలో జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, మల్లవల్లి రైతులు కలిసి విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూ సేకరణ నిర్వహించారని, కానీ నేటికి కొంతమంది సాగుదారులకు నష్టపరిహారం అందలేదని వాపోయారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బాధిత రైతులకు ఎంపీ బాలశౌరి హామీ ఇచ్చినట్లు తెలిపారు. జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, జిల్లా కార్యదర్శి మరీదు శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు వడ్డి శివ నాగేశ్వరరావు, మల్లవల్లి సాగుదారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు



పోరంకిలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు



లడ్డూ స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

పెనమలూరు: నియోజకవర్గ పరిధిలో వినాయకుడి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పెనమలూరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామాలయం దేవస్థానంలో వినాయకుడి విగ్రహాన్ని వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేశారు. భక్తులు ప్రతి రోజూ వినాయకుడికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పోరంకి గంగానమ్మ గుడి వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో శివసతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. నృత్య కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారులకు ట్రస్ట్ బహుమతులు అందజేసింది.

రూ.30 వేలు పలికిన గణనాథుడి లడ్డూ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక కృష్ణానగర్‌లో జరుగుతున్న వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలంలో రూ.30 వేలు పలికింది. గత 19 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో గణనాథుడు పూజలందుకున్న లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవ మండపం వద్ద గురువారం నిర్వహించిన స్వామి వారి లడ్డూ వేలంలో కనికంటి శ్రీనివాసరావు రూ.30 వేలుకు ప్రసాదాన్ని దక్కించుకున్నాడు.



పెనమలూరులో కొలువు తీరిన వినాయకుడు

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



హనుమాన్‌జంక్షన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి(72) మృతి సీపీఎంకు తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక ప్రధాన కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి గురువారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు పలికారు. దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి తన కంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారని, పీడిత ప్రజల పక్షాన ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ, పార్టీ సీనియర్ నాయకుడు జుజ్జవరపు ఏసుపాదం, సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు తోట సాంబశివరావు పాల్గొన్నారు.

ఎలుకపాడులో నివాళి

ఉంగుటూరు: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. ఉంగుటూరు మండలం ఎలుకపాడులో అమరవీరుల స్థూపం వద్ద సీపీఎం నాయకులు, సానుభూతిపరులు మౌనం పాటించి సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజ్మీర మాట్లాడుతూ.. బడుగు, బలహీన, పేద అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.సంతోష్‌కుమార్, మండల కమిటీ సభ్యుడు పులి శ్రీనివాసరావు, సానుభూతిపరులు సర్పంచ్ పోలిమెట్ల శ్రీరామ్, మాజీ ఎం.నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ



ఆటోనగర్(విజయవాడతూర్పు): నైతికతే నిజమైన స్వేచ్ఛ మొరాలిటీ ఈజ్ ఫ్రీడమ్ అనే నినాదంతో దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు విజయవాడ నార్త్ జమాతె ఇస్లామి హింద్ మహిళ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ రచయిత్రి షరీఫా బేగం అన్నారు. విజయవాడ జమాతె ఇస్లామి హింద్ కార్యాలయంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే వాల్‌పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేచ్ఛపై తప్పుడు అభిప్రాయాలు మనిషిని పశు ప్రవృత్తికి దిగజార్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ పేరుతో మరీ ముఖ్యంగా యువతలో విచ్చలవిడితనం, అనైతిక కార్యకలాపాలు దేశ భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. ఈ విషయమై పాఠశాలలు, కళాశాలల్లో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది 8 కోట్ల మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వీటిపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు స్వేచ్ఛ పేరుతో కుటుంబ వ్యవస్థ బీటలు వారుతోందన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ నగర అధ్యక్షురాలు ఖానితా సల్మా, రాష్ట్ర కార్యదర్శి సాజిదా బేగం, కైసర్‌బేగం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ, పుస్తకాలు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో గురువారం స్వామి వారు శ్రీ విద్యాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సహస్రనామార్చన తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్ళు) పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.